క్లుప్తంగా

ఎమ్మెల్సీకి ఘన స్వాగతం



ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడు

నరసన్నపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విజయం సాధించిన గాదె శ్రీనివాసులు నాయుడుకు నరసన్నపేటలో ఘన స్వాగతం లభించింది. మంగళవారం రాత్రి స్థానిక పైడితల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నరసన్నపేటకు వచ్చిన శ్రీనివాసులునాయుడుకి ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు బి.కేశవరావు, కె.లక్ష్మణరావు, సి.హెచ్.వాసుదేవరావు, జి.చంద్రశేఖర్, చల్ల గణేష్ స్వాగతం పలికారు. పూల దండలు వేసి సత్కరించారు. స్థానిక ఉపాధ్యాయులను శ్రీనివాసులు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. వైకుంఠరావు, కోటిబాబు, పల్లి రమేష్, పంగ అప్పలనాయుడు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరస్వామి కల్యాణం

ఎల్.ఎన్.పేట: మండలంలోని తురకపేట సెంటర్‌లో గల వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం స్వామి కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పద్మావతి, వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామపెద్దలు, దాతల సహకారంతో భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు.

పరిష్కార వేదిక రేపు

పొందూరు: ఈ నెల 7వ తేదీన స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వినియోగదారుల సమస్యలపై పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. ఈ మేరకు శ్రీకాకుళం ఈఈ (ఆపరేషన్) పైడి యోగేశ్వరరావు బుధవారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరిష్కార వేదిక ఉంటుందన్నారు. పొందూరు, లావేరు, జి.సిగడాం, ఎచ్చెర్ల, రణస్థలం, పైడిభీమవరం పరిధిలోని ఏపీ ఈపీడీసీఎల్ సెక్షన్ల వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పరిష్కార వేదికకు సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు బి.సులేఖ రాణి, అకౌంటెంట్ సభ్యుడు షేక్ బాబర్, తదితరులు హాజరవుతారన్నారు.

అభయాంజనేయ స్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి విగ్రహం

సారవకోట: మండలంలోని బద్రి పంచాయతీ పరిధి గోపినాథపురం గ్రామంలో గల హనుమాన్ మందిరంలో అభయాంజనేయ స్వామికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందిరం వార్షికోత్సవం పురస్కరించుకుని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారిని నిమ్మకాయలతో అలంకరించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్నసంతర్పణ నిర్వహించారు.

తాగునీటికి కటకట!

- అలంకారప్రాయంగా ఇంటింటికీ కుళాయిలు
- పలుచోట్ల పూర్తికాని జల్ జీవన్ మిషన్ పనులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

సారవకోట:

కొద్దిరోజులుగా ఎండలు మండుతున్నాయి. దీనికితోడు పలుచోట్ల నదులు, చెరువులు, జలాశయాలు పూర్తిగా అడుగంటాయి. వేసవి రాకముందే పలు గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. అయితే కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జల్ జీవన్ మిషన్ ద్వారా అయినా ఈ వేసవిలో తాగునీరు సక్రమంగా అందుతుందా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. నరసన్నపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో 74,561 గృహాలుండగా.. 33,456 గృహాలకు ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఏ ఒక్క గ్రామంలోనూ తాగునీరు సరఫరా అయ్యే దాఖలాలు లేవు. ఈ కుళాయిలు ఏర్పాటు చేసేందుకు గ్రామాల్లో పటిష్టంగా ఉన్న వీధి రోడ్లు తవ్వకాలు చేపట్టి పైపులైన్లు ఏర్పాటు చేశారు. తవ్వకాలు చేపట్టి పైపులు ఇంటింటికీ చాలావరకు అమర్చారే తప్ప.. నీటి సరఫరా చేపట్టే దాఖలాలు కన్పించడం లేదు.

మూడు మండలాల్లో 30 శాతం లోపే..

నరసన్నపేట మండలంలో ఎక్కువ కనెక్షన్లు ఇచ్చారు. మిగిలిన మూడు మండలాల్లో 30 శాతం లోపే పనులు జరిగాయి. ఇచ్చిన కనెక్షన్లకు కూడా నీటి సరఫరా జరిగే పరిస్థితి ఎక్కడా లేదు. దీంతో తాగునీటి సమస్య ఈ వేసవిలో ఎదురయ్యే అవకాశాలు కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. గతేడాది అక్టోబర్ నుంచి వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలు ఇప్పటికే అడుగంటిపోయాయి. గ్రామాల్లో ఉన్న నీటి వనరులైన బావులు, బోర్లు అంతంత మాత్రంగా పనిచేస్తున్నాయి.



కొత్తూరులో ఇంటింటికీ అమర్చిన కుళాయిలు

నరసన్నపేట నియోజకవర్గంలో జల్ జీవన్ మిషన్ పథకం వివరాలు

మండలం	మొత్తం గృహాలు	జేజేఎం కనెక్షన్లు
సారవకోట	14,145	3,685
జలుమూరు	19,312	7,828
పోలాకి	18,675	6,021
నరసన్నపేట	22,389	15,922

పాడైన మంచినీటి పథకాలు..

సారవకోట మండల కేంద్రంలో ఉన్న తాగునీటి పథకం పురాతనమైనది కావడంతో అన్ని వీధులకు తాగునీటి సరఫరా జరగకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే ఉన్న రక్షిత మంచి నీటి పథకాలు చాలాచోట్ల పాడైపోవడంతో అలుదు, చీడిపూడి వంటి ప్రధాన గ్రామాల్లో తాగునీటి సరఫరా జరగడం లేదని ఆయా గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకువస్తున్నారు. ఆయా పథకాల మరమ్మతులు చేయించేందుకు కావాల్సిన నిధులు లేకపోవడం ఒక ఎత్తు అయితే.. జల్ జీవన్ మిషన్ ద్వారా పైపులైన్లు వేయడం జరిగింది. ఆ పాత పథకాలకు నిధులు ఖర్చు చేయడం ఎందుకు అనే ఆలోచన పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు చేస్తున్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి స్థానిక అధికారులు ముందస్తు ప్రణాళికలు తీసుకునే దాఖలాలు ఇప్పటికీ కన్పించడం లేదు.



కుళాయిలు వేసేందుకు అలుదులో రోడ్డును తవ్విన దృశ్యం

పనులు చేయిస్తున్నాం..



జల్ జీవన్ మిషన్ ద్వారా మంజూరైన నీటి పథకాలను త్వరగా పూర్తిచేసి ఇంటింటికీ తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కుళాయిలు ఏర్పాటు చేసినా.. చాలాచోట్ల ట్యాంకుల నిర్మాణం పూర్తికావల్సి ఉంది. అవి పూర్తి అయితే తాగునీరు సరఫరా చేసేందుకు అవకాశం ఉంటుంది.

– రట్టి మధుబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, సారవకోట

తాగునీటి సమస్య పరిష్కరించాలి



ఈ వేసవిలో తాగునీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. జల్ జీవన్ మిషన్ ద్వారా వేసిన ఇంటింటికీ కుళాయి గ్రామాల్లో చాలా చోట్ల పూర్తి కాలేదు. పనులను త్వరగా పూర్తి చేసి తాగునీటి సరఫరా చేయాలి.

– పల్లి సావిత్రి, గొర్రిబంద ఎంపీటీసీ సభ్యురాలు, సారవకోట

రక్త దానం... ప్రాణదానం



రక్తం దానం చేస్తే.. ప్రాణదానం చేసినట్లేనని నరసన్నపేట డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శాంతి హేమ్ అన్నారు. బుధవారం కళాశాలలో రక్త దాన శిబిరం ఏర్పాటు చేశారు. 35 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. శ్రీకాకుళం రిమ్స్‌కు చెందిన రక్తనిధి సిబ్బంది రక్తాన్ని సేకరించారు. రక్త దానం చేసిన వారికి ఎన్‌సీసీ అధికారి జి.రవికుమార్, ఢిల్లీశ్వరరావు, నాగరాజు, ఆర్‌సీసీ కో ఆర్డినేటర్ పూజా భరద్వాజ్, తదితరులు అభినందించారు.

– నరసన్నపేట

పాడైన రక్షణ గోడలు..



ఈ చిత్రం సరుబుజ్జిలి మండలంలోని ఎ.ఎల్.నగరం వద్ద శిథిలమైన వంశధార కుడి ప్రధాన కాలువ రక్షణ గోడ. గోనెపాడు నుంచి రొట్టవలస వరకు గల ప్రధాన కాలువలో ఎ.ఎల్.నగరం, బప్పడాం, గోనెపాడు, సరుబుజ్జిలి ప్రాంతాల్లో కాలువ గట్లు కోతకు గురయ్యాయి. సాగునీరు ప్రవహించే సమయంలో కాలువ గట్లుకు గండ్లు పడకుండా ఏర్పాటు చేసిన రక్షణ గోడలు పాడయ్యాయి. కాలువలోకి దిగేందుకు నిర్మించిన మెట్లు కూడా చాలాచోట్ల పాడయ్యాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

‘ఉపాధి’లో రగడ..!

జలుమూరు: ఉపాధి హామీ పథకంలోని ఇద్దరి ఉద్యోగుల మధ్య వివాదం జరిగింది. ఇంజినీరింగ్ కన్సల్టెంట్(ఈసీ) పట్ట సోమేశ్వరరావుకు టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ) పూర్ణ చంద్రరరావుకు మధ్య బుధవారం ఘర్షణ చోటు చేసుకుంది. సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఉపాధి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఫారం పాండ్స్ లక్ష్యాలు సాధించాలని ఈసీ సోమేశ్వరరావు కింద స్థాయి సిబ్బందికి సూచనలు చేశారు. ఇందులో భాగంగా జలుమూరు క్లస్టర్ పరిధిలోని టీఏ పూర్ణచంద్రరరావుకు మీ క్లస్టర్ పరిధిలో ఎంతవరకు లక్ష్యాలు సాధించారని ప్రశ్నించారు. ఒకసారి 20 అని, మరోసారి 30 అని చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. చూపుడు వేలు ఎత్తి చూపడం ఏంటని ఈసీని టీఏ అడిగారు. ఈసీ తన చొక్కా పట్టుకుని తోశేశారని టీఏ అన్నారు. కేవలం రాజకీయ పలుకబడితో ఇలా కింది స్థాయి ఉద్యోగిపై దాడి చేసి ఇబ్బంది పెట్టడం ఎంతవరకు న్యాయమన్నారు. దీనిపై ఈసీ పట్ట సోమేశ్వరరావును వివరణ కోరగా.. టీఏ పూర్ణచంద్రరరావు దురుసుగా సమాధానం చెప్పడంతోనే తోయడం జరిగిందన్నారు. ఆయనపై వ్యక్తిగతంగా కోపం లేదన్నారు. దీనిపై ఎంపీడీఓ అప్పలనాయుడుకి ఇద్దరు ఉద్యోగులు ఫిర్యాదు చేశారు.

పరామర్శ..



నారాయణమూర్తిని పరామర్శిస్తున్న సత్యనారాయణ, నాయకులు

బూర్జ: మండలంలోని మదనాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు అత్త అమ్మడమ్మ ఇటీవల మృతి చెందారు. ఖండాపు కుటుంబాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.జి.సత్యనారాయణ బుధవారం పరామర్శించారు. గుత్తావల్లి గ్రామంలో బొడ్డేపల్లి నారాయణమూర్తి తల్లి లక్ష్మి మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో సరుబుజ్జిలి మండల అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ గుమ్మడి రాంబాబు, నాయకుడు బొడ్డేపల్లి నాగరాజు ఉన్నారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు

హిరమండలం: క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేస్తే సత్ఫలితాలు ఉంటాయని హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ టి.కేశవరావు అన్నారు. బుధవారం పాఠశాల ఆవరణంలోని భవిత కేంద్రాన్ని సందర్శించారు. ప్రత్యేకావసరాల చిన్నారులకు నిర్వహిస్తున్న ఫిజియోథెరిపీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రత్యేకావసరాల విద్యార్థులను పూర్వ ప్రాథమిక దశలోనే వైకల్య నిర్ధారణ చేయాలని, ప్రభుత్వం అందించే ఉపకరణాల వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. వైద్యురాలు గ్రేసీ శాంతి, సహిత ఉపాధ్యాయులు సీతంనాయుడు, గోవిందరావు ఉన్నారు.

కూటమి పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యం

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రైవేట్ కాలేజీల్లో ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువులు చదువుతున్నవారికి ఈ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవటంతో ఆయా కాలేజీల యాజమాన్యాలు ఫీజు బకాయిలు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి తీసుకువస్తున్నాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు అప్పలు చేసి ఫీజులు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. వసతి దీవెన బకాయిలు కూడా విద్యార్థులకు చెల్లించలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. చదువులు పూర్తి చేసి బయటకు వచ్చిన విద్యార్థులకు ఫీజు బకాయిలు చెల్లిస్తే కానీ.. పలు కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ ఏడాది ఏప్రిల్ నాటికి ఒక విద్యా సంవత్సరం ముగుస్తుందన్నారు. తల్లికి వందనం డబ్బులు ఎందుకు చెల్లించటం లేదని ప్రశ్నించారు. ఇప్పటికే ఒక ఖరీఫ్ సీజన్ ముగిసిందని, మార్చి ఆఖరు నాటికి రబీ సీజన్ కూడా ముగుస్తుందని, అయినప్పటికీ రైతులకు పెట్టుబడి సాయంగా ఇస్తామన్న అన్నదాత సుఖీభవ పథకం ఎప్పుడు ఇస్తారని నిలదీశారు. అధికారం చేపట్టిన తొమ్మిది నెలల పాలనలో మహిళలను, విద్యార్థులను, రైతులను మోసం చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఎప్పుడు అమలు చేస్తారో ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ నెల 8వ తేదీ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఉచిత బస్ ప్రయాణం అమలు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

నేడు మద్యం షాపు లాటరీ

పాతపట్నం: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పాతపట్నం మండలానికి శ్రీశైన సామాజికవర్గానికి మద్యం షాపు కేటాయించారు. గతంలో ఐదుగురు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ నెల 6వ తేదీన శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల రోడ్డులో ఉన్న అంబేడ్కర్ ఆడిటోరియంలో లాటరీ తీస్తారని సీఐ కె.కృష్ణారావు బుధవారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్నవారు హాజరుకావాలన్నారు.

గ్యాస్ గోదాం పరిశీలన



గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

పొందూరు: స్థానిక ఇండేన్ గ్యాస్ కార్యాలయం గోదాంను జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ బుధవారం పరిశీలించారు. అనంతరం గ్యాస్ కార్యాలయంలో నిర్వాహకులు, డెలివరీ బాయ్స్‌తో మాట్లాడారు. వినియోగదారులకు ఇబ్బంది లేకుండా గ్యాస్ సరఫరా చేయాలని సూచించారు. గ్యాస్ సిలిండర్ బిల్లుకంటే అదనంగా రుసుం వసూలు చేయవద్దని స్పష్టం చేశారు. రీసర్వే డీటీ వైకుంఠరావు, వీఆర్వోలు ఈశ్వరరావు, సాయి, తదితరులు పాల్గొన్నారు.

పశు వ్యాధులపై అప్రమత్తం



టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏడీ ఆనందరావు

ఆమదాలవలస: వేసవి కాలంలో పశువులకు వచ్చే వ్యాధులపై పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ ఏడీ ఆర్.ఆనందరావు సూచించారు. బుధవారం పురపాలక సంఘం పరిధిలోని 22వ వార్డు లక్ష్మిడిపేటలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ, బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా వేశారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు నాలుగు మాసాల వయసు దూడల నుంచి అన్ని పశువులకు వేసుకోవచ్చునని తెలిపారు. పాడి రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వ్యాక్సినేషన్ పరిశీలన..

మెళియాపుట్టి: నాలుగు నెలల వయసు దాటిన ప్రతి పశువుకీ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామని పాతపట్నం ప్రాంతీయ పశువైద్య సహాయ సంచాలకులు మంచు కరుణాకర్ తెలిపారు. మండలంలోని మర గ్రామంలో బుధవారం టీకా ప్రక్రియను పరిశీలించారు. పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

బుచ్చిపేటలో వైద్య శిబిరం



సాక్షి ఎఫెక్ట్...

వైద్య శిబిరంలో రోగులకు రక్త నమూనాలు సేకరిస్తున్న ఏఎన్ఎం



బుచ్చిపేటలో క్లోరినేషన్ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది


నరసన్నపేట: మండలంలోని మడపాం పంచాయతీ పరిధిలో గల బుచ్చిపేటకు జ్వరమొచ్చింది అనే వార్త బుధవారం సాక్షిలో ప్రచురితమైంది. దీనిపై మాకివలస పీహెచ్‌సీ సిబ్బంది స్పందించి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఏఎన్ఎంలు భవానీ, శారద 37 మంది రోగులకు తనిఖీలు చేశారు. 15 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. 10 మంది జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించి మందులు పంపిణీ చేశారు. అంతకు ముందు గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లారు. అనంతరం ఏఎన్ఎం భవానీ మాట్లాడుతూ వేడినీళ్లు తాగాలని, ఆహార నియమాలు పాటించాలన్నారు. జ్వరాలు వస్తే పీహెచ్‌సీకి వచ్చి తనిఖీలు చేయించుకోవాలన్నారు. అన్ని వీధుల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. మంచినీటి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపారు. వాటర్ ట్యాంక్‌ను క్లోరినేషన్ చేశారు.

నాణ్యతకు తూట్లు

- రోడ్డు పూర్తికాక ముందే కాలువలపై విరిగిన పలకలు



సారవకోటలో పశువైద్య కేంద్రం సమీపంలో విరిగిన పలక



వడ్డినవలస సమీపంలో ఇలా..

సారవకోట: జాతీయ రహదారిని (326-ఎ) నరసన్నపేట మండలంలోని జమ్ము గ్రామం నుంచి ఒడిశాలోని మోహన వరకు నిర్మించారు. ఈ రహదారిలో మురుగు నీటి కాలువలు నిర్మించి వాటిపై పలకలు ఏర్పాటు చేశారు. దీంట్లో భాగంగా సారవకోట, అలుదు, అంగూరు, వెంకటాపురం గ్రామాల్లో మురుగు నీటి కాలువలపై పలకలు ఏర్పాటు చేశారు. వీటి నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో పలకలు ఏర్పాటు చేసిన కొన్ని రోజులకే విరిగిపోయాయి. దీంతో కొన్నిచోట్ల ఈ విరిగిన పలకలను గమనించకపోవడంతో కొంతమంది ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికీ తిలారు, పాతపట్నంలో జరుగుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం వలన రోడ్డు పూర్తిస్థాయిలో నిర్మాణం కాలేదు. అయినప్పటికీ ఈ పలకలు విరిగిపోవడం విచారకరం.

‘గాదె’ విజయంపై ఆనందం



తంపలో కేక్ కట్ చేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

హిరమండలం:

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విజయం సాధించిన గాదె శ్రీనివాసుల నాయుడుకు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. మండలంలోని తంప పాఠశాల ఆవరణలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు పల్లి రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం విజయోత్సవం నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. తంప, అవలంగి, భగీరథిపురం, గులుమూరు, ఎల్.ఎన్.పేట పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తప్పుడు రశీదులతో ఆశీలు వసూలు



వసూలు చేస్తున్న రశీదులు చూపుతున్న సంఘం ప్రతినిధులు

నరసన్నపేట: వివిధ ప్రాంతాల నుంచి సరుకులతో నరసన్నపేటకు వచ్చే లారీల సిబ్బంది వద్ద తప్పుడు రశీదులతో పలువురు ఆశీలు వసూలు చేస్తున్నారని న్యూ ఆంధ్రా మోటార్ ట్రక్స్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శేషగిరి ఆరోపించారు. ఈ మేరకు బుధవారం నరసన్నపేటలో ఆయన మాట్లాడారు. సరుకు టాక్స్ చెల్లించి వివిధ ప్రాంతాలకు ట్రాన్స్‌పోర్టు చేస్తున్నామని, ఇటువంటి లారీలు టౌన్‌లోకి వచ్చినప్పుడు పంచాయతీ పేరున ఇష్టానుసారంగా ఆశీలు వసూలు చేయడం సరికాదన్నారు. రశీదులపై పంచాయతీ ముద్రలు, సంతకాలు ఉండడం లేదని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా నరసన్నపేటతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న వసూళ్లపై పోలీసులు, పంచాయతీ ఈవోకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆయనతో పాటు స్థానిక లారీ ఓనర్స్ సంఘం ప్రతినిధులు ఊణ్ణ శ్రీధర్, గుప్త, వి.మల్లేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ఎల్లమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తూరు: మండలంలోని పాతపానుటూరులో గల ఎల్లమ్మ ఆలయంలో గ్రామస్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏడాదికి ఒకసారి నిర్వహించే ఉత్సవాల్లో ఎల్లమ్మకు మొక్కులు చెల్లించారు. పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయం వద్ద భక్తులతో సందడిగా నెలకొంది.

రేపటి నుంచి జామి యాత్ర

కొత్తూరు: మండలంలోని నివగాం గ్రామంలో ఉన్న సిరుల పోతన్న, ఎల్లమ్మ మందిరం వద్ద ఈ నెల 7 తేదీ నుంచి జామి యాత్ర ఐదు రోజులపాటు నిర్వహించనున్నారు. సంప్రదాయ ప్రకారం ముందుగా పర్లాకిమిడి మహారాజు తరఫున పర్లాకిమిడి నుంచి జ్యోతి, పసుపును మందిరం వద్దకు తీసుకువస్తారు. మహారాజు నుంచి తీసుకువచ్చిన పూజా సామాన్లతో తొలిపూజ చేస్తారు. కొత్తూరు మండలంలోపాటు ఒడిశాకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లిస్తారు. ఐదు రోజులపాటు పలు రకాల ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.